ప్రశాంతంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నీట్ పీజీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 180 మంది అభ్యర్థులకు గాను 179 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ బి.చంద్రశేఖర్ సందర్శించారు. సౌకర్యాలను పరిశీలించి, కేంద్రం బాధ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అదనపు సూపరింటెండెంట్ రమేష్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, పరీక్షల ఇన్‌ఛార్జి ఉపేందర్ ఉన్నారు.

నాటి జలయజ్ఞ ఫలం.. నేడు చెరువులో పుష్కలం



గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఎల్‌నినో ఫలితమా.. అని మండలంలో ఎక్కడా తగిన వర్షం కురవలేదు. వర్షానికి నిండిన చెరువులు లేవు. కానీ పక్షుల కిలకిలలు, నీటి గలగలలు ఇక్కడ వినొచ్చు. పై చిత్రం చూడండి. ఇదేదో పాతచిత్రం అనుకుంటే పొరపాటే. 'ఈనాడు' జలయజ్ఞంలో భాగంగా 20 ఏళ్ల క్రితం ఎత్తపువారి చెరువుకు సుమారు రూ.4 లక్షల వ్యయంతో మరమ్మతులు చేసిన ఫలితం నేటికీ రైతులకు కన్నులపండువగా కనిపిస్తోంది. పరిసర మూడు గ్రామాల ప్రజలకు భూగర్భ జలాలను కాపాడుతూ వ్యవసాయం కొనసాగేందుకు ఈ చెరువు ఎంతో దోహదం చేస్తోంది. పరిసరాల్లోని జిన్నాయిచింత, పల్లిపహాడ్, బ్రాహ్మణగూడెం గ్రామాల మధ్యన ఉన్న ఈ చెరువుకు అలుగు నిర్మించిన నాటి నుంచి పరసరాల్లోని బోర్లు, బావులు నీటి మట్టంతో ఉబికాయి. ఈ సారి ఇప్పటి వరకూ వర్షం కురవ లేదు. కాని ఇందులో అలుగు గోడ వరకూ నీళ్లు ఉన్నాయి. ఈ చెరువు చుట్టూ పక్షులు వందలు కాదు వేల సంఖ్యలో ఇక్కడ ఆవాసం ఏర్పరుచుకున్నాయంటే అతిశయోక్తి కాదు. పక్క ఊళ్లల్లో బోర్లు ఆగి పోస్తున్నాయంటున్నారు. కాని మా బోర్లలో నీళ్లు ఏమాత్రం తగ్గలేదని జిన్నాయిచింత గ్రామస్థుడు పొనుగోటి మనోహర్‌రావు అభిప్రాయపడ్డారు.

సర్ నోటీసులతో కొత్త తంటాలు

అయోమయంలో ఓటర్లు

ఈనాడు, నల్గొండ: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల్లో ఓటర్లు పేర్కొన్న వివరాల్లో లోపాలున్నాయని ఎన్నికల సంఘం అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో ఎంతమంది తుది జాబితాలో మిగులుతారనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.



రాజపేట మండలం మొల్లగూడెంలో నోటీసులు అందజేస్తున్న బీఎల్వో

❖ సర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత జాబితాలోని ఓటర్లు 2002 నాటి జాబితాలోని తమ పేరు, తల్లిదండ్రుల పేరు, తాత, నానమ్మల పేర్లు, వివరాలతో మ్యాపింగ్ చేసుకోవాలి. బీఎల్‌వోలకు సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో చాలామంది ఓటర్లు తమ వివరాలను మ్యాపింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పిదాలు, లోపాలతో కూడిన వివరాలతో మ్యాపింగ్ చేసుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 5,56,576 మందికి నోటీసులు జారీ చేశారు.

❖ ఈ నెల 27 నుంచి నోటీసులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభం కాగా ఇంటింటికీ అందజేయడంలో ఆలస్యం జరుగుతోంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించడంతో నోటీసులు అందుకునే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

❖ నోటీసులు అందుకున్న వారి సమస్యలు పరిష్కరించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో, పోలింగ్‌స్టేషన్, బూత్‌లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు.

❖ వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న వారికి జారీ చేసిన నోటీసులను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సదరు ఓటర్ల తరఫున కుటుంబంలోని వయోజన సభ్యులు, ఈఆర్వో, ఏఈఆర్వో ఎదుట ప్రత్యక్షంగా హాజరై అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సమాచారాన్ని అందించేందుకు అనుమతి ఇస్తున్నారు.

❖ సర్ ప్రక్రియకు ముందు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 29,84,448 మంది ఓటర్లు ఉండగా సర్ ప్రక్రియ తర్వాత వెల్లడించిన ముసాయిదాలో 27,03,385 మంది ఓటర్లు ఉన్నారు.

❖ ప్రస్తుత ఓటర్ జాబితాలోని ఓటరు పేరుకు 2002 సర్‌లోని ఓటరు పేరుకు మధ్య తేడా, పొంతన లేకుండా ఉండటం, 2002 ఎస్ఐఆర్ జాబితాతో ఓటరు జాబితా అనుసంధానించడానికి ఉపయోగించిన వివరాల ప్రకారం వారి తల్లి, తండ్రికి మధ్య వయస్సులో వ్యత్యాసం 15 ఏళ్ల కంటే తక్కువగా ఉంటే ఓటర్లకు నోటీసులు జారీ అవుతున్నాయి.

వివరాలు ఇలా..

జిల్లా	గతంలో	ముసాయిదా	తగ్గుదల	మరణించిన వారు	బదిలీ	అందుబాటులో లేనివారు	నోటీసులు
నల్గొండ	15,16,253	13,57,618	1,58,635	32,517	1,00,144	6,978	2,68,798
సూర్యాపేట	10,08,252	9,11,945	96,307	26,059	48,310	6,862	1,90,676
యాదాద్రి	4,59,943	4,33,822	26,121	7,156	14,604	1,176	97,102

సెప్టెంబరు 1న ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు


నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: సెప్టెంబరు 1న ఉమ్మడి నల్గొండ జిల్లా జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు ప్రసాద్, కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 1-1-2011 నుంచి 31-12-2012 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డ్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నల్గొండ విపస్య స్కూల్‌లో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారు సెప్టెంబర్ 4వ తేదీ నుంచి నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పత్తి కొనుగోళ్లకు టెండర్లు

భానుపురి, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ టెండర్లను ఆహ్వానించింది. మరో రెండు నెలల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉండటంతో సంబంధిత అధికారులు ముందుగానే టెండర్లకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలో 2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జిన్నింగ్, ప్రెస్సింగ్ టెండర్లను కోరింది. జిల్లాలో 42 కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు జిన్నింగ్ మిల్లుల్లో బేళ్ల కోసం టెండర్లు ఆహ్వానించింది. గతంలో ధరలతో పాటు ఇతర నిబంధనలతో ఒకే టెండర్ ప్రకటన ఇచ్చేవారు. అలాంటిది ఈ సీజన్‌లో తొలి విడత ధరల ప్రస్తావన లేకుండా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలంటూ టెండర్ ప్రకటన ఇచ్చింది.

42 కేంద్రాలు...

జిల్లాలో 21 మార్కెట్ యార్డుల పరిధిలో 42 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. నల్గొండ 23, యాదాద్రి 13, సూర్యాపేట జిల్లాలో 6 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఈసారి కూడా అవే ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల వారీగా కొనుగోలు చేసే పత్తిని బేళ్లుగా మార్చేందుకు ఏటా జిన్నింగ్‌లను అద్దెకు తీసుకుంటున్నారు. జిల్లాల వారీగా సాగు, పత్తి దిగుబడుల అంచనాల మేరకు కొనుగోలు కేంద్రాలు, జిన్నింగులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్‌లో జిన్నింగ్‌లు, గిడ్డంగులు, బేళ్ల రవాణాకు వాహనాలు, తాత్కాలిక ఉద్యోగులు తదితర వాటికి కూడా టెండర్లను ఆహ్వానించినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.



తుంగతుర్తి పరిధిలో సాగు చేసిన పత్తి

సాగు ఇలా.. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో పత్తి 10.5 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం 80 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేసే సీసీఐ పత్తిని గింజలు తీసి బేళ్లుగా మార్చి సరఫరా చేయడానికి ఏటా టెండర్లు ఆహ్వానిస్తుంది. ఒకటి రెండు నెలల్లో క్రయవిక్రయాలు ప్రారంభించే అవకాశం ఉండటంతో వ్యాపారులతో పాటు సీసీఐ పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇళ్ల బిల్లులకు సాంకేతిక చిక్కులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: నిరుపేదలకు ఇళ్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. సొంత స్థలం ఉండి నివాసం లేనివారికి తొలి ప్రాధాన్యం ఇస్తోంది. నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. ఇప్పటికే తొలి విడతకు సంబంధించి 793 ఇళ్లు పూర్తి కాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ప్రభుత్వం తాజాగా కొత్త నిబంధన అమల్లోకి తీసుకొచ్చింది. అయితే దీని వల్ల కొందరు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

నూతన నిబంధన ఇదే...

పాత విధానంలో 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో స్లాబ్ నిర్మించాలనే నిబంధన ఉంది. ఇక మీదట అలా కాకుండా 750 చదరపు అడుగుల్లోనే పైకప్పు నిర్మించాలని నిబంధన విధించింది. నిర్మాణం అంతకు మించితే బిల్లు ఇవ్వరు. జిల్లాలో సుమారు 1526 మంది పాత లెక్క ప్రకారం 800 చ. అడుగుల మేర ఈ మధ్య కాలంలో స్లాబ్ వేయించారు. ఇప్పుడు బిల్లుల చెల్లింపుల్లో సాంకేతిక సమస్య వస్తోంది. మరో నిర్మాణాలకు 600 చదరపు అడుగుల్లోనే స్లాబ్ వేయడంతో ఆ లబ్ధిదారులకు చిక్కులు ఎదురవుతున్నాయి.

జిల్లాలో తొలి విడత నిర్మాణాలు..	
ఇళ్ల మంజూరు	2870.
బేస్‌మెంట్ స్థాయి	279.
రూఫ్ స్థాయిలో	273.
స్లాబ్ వరకు	1526.
పూర్తయినవి	793

సగానికి పైగా పైకప్పు నిర్మాణానికే..

ఇందిరమ్మ ఇంటి పైకప్పు నిర్మాణానికి రూ.3 లక్షలు అవుతోంది. ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తుండగా సగం పైగా స్లాబ్‌కే చాలడం లేదు. సాయం సరిపోక కొందరు లబ్ధిదారులు నిర్మాణాలను మధ్యలోనే నిలిపి వేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి పైకప్పు విస్తీర్ణ పరిమితిని సడలించింది. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం స్లాబ్ నిర్మిస్తేనే బిల్లులు మంజూరవుతాయని హౌసింగ్ డీఈ శంకర్ తెలిపారు.



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రగతిచక్రంతో అనుబంధం..
కురిసిన ఆదాయం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని సాధించింది. ఆర్టీసీ ఈ నెల 27, 28 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడిపింది. ఈ రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మొత్తం 6.21 లక్షల కిలోమీటర్లు బస్సులు నడవగా.. రూ.4.92 కోట్ల రికార్డు ఆదాయం లభించింది. దీంతో రాఖీ ఆదాయంలో నల్గొండ రీజియన్ రాష్ట్రంలోనే ముందంజలో నిలిచింది.

మూడు రోజుల్లో రూ.7.1 కోట్లు..

రాఖీ పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల ద్వారా ఆర్టీసీకి ఈ నెల 27, 28, 29 తేదీల్లో మొత్తం రూ.7.1 కోట్ల ఆదాయం లభించింది. ఈ మూడు రోజుల్లో మొత్తం 9.23 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించాయి. ఈ నెల 28న అత్యధికంగా రూ.2.87 కోట్ల ఆదాయం రాగా 143 ఓఆర్‌తో రీజియన్ ముందంజలో నిలిచింది. ఆ రోజు 2.83 లక్షల కిలో మీటర్లు బస్సులు నడపాలని అధికారులు లక్ష్యం నిర్దేశించగా 39 వేల కిలోమీటర్లు అదనంగా నడిచాయి. మూడు రోజుల్లో మొత్తం 11 లక్షల మందికి పైగా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించారు.

డిపోల వారీగా ఈ నెల 27 నుంచి 29 వరకు వచ్చిన ఆదాయం వివరాలు..

డిపో	కిలోమీటర్లు (లక్షల్లో)	ఆదాయం (రూ.కోట్లలో)
దేవరకొండ	1.74	1.26
కోదాడ	1.19	0.81
మిర్యాలగూడ	1.38	0.99
నల్గొండ	1.88	1.34
నార్కట్‌పల్లి	0.32	0.29
సూర్యాపేట	1.90	1.65
యాదగిరిగుట్ట	1.07	0.74

సూర్యాపేటలో అత్యధికం..

మూడు రోజులు కలిపి సూర్యాపేట డిపో పరిధిలో మొత్తం 1.90 లక్షల కిలోమీటర్లు బస్సులు నడపగా.. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా రూ.1.65 కోట్ల ఆదాయం వచ్చింది. డిపో నుంచి మూడు రోజుల్లో అత్యధికంగా 2.60 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఈనెల 28న 97 వేల మంది బస్సుల్లో ప్రయాణించారు. సోమవారం ప్రయాణికులు తిరుగు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కుంగిన సముద్రం..
నిద్రలో యంత్రాంగం



కుంగిన ఉదయసముద్రం రిజర్వాయర్ కట్ట అంతర్భాగం

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో సుమారు 600 గ్రామాలకు తాగునీరు అందించే ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పానగల్)కు ప్రమాదం పొంచి ఉంది. రిజర్వాయర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రాజెక్టు కట్ట లోపలి భాగం కుంగిపోయింది. దీంతో సుమారు కిలోమీటరు మేర రివిట్‌మెంట్ పూర్తిగా దెబ్బతింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.5 టీఎంసీల మేరకు నీరు నింపితే కట్టకు ముంపు పొంచిఉండే అవకాశం ఉంది.

❖ రిజర్వాయర్ కట్ట కుంగిపోవడం, రివిట్‌మెంట్ మరింత దెబ్బతినకుండా నీటిపారుదలశాఖ చర్యలు చేపట్టింది. రూ.45 లక్షల వ్యయంతో ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. అవి ఎండకు ఎండి, వానకు తడవడంతో చిరిగిపోయాయి. దీంతో ఇసుక నీటిలోకి జారిపోతోంది.

❖ ఉదయ సముద్రం రిజర్వాయర్ శాశ్వత మరమ్మతులపై నీటిపారుదల శాఖ దృష్టి సారించడం లేదు. ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. శాశ్వత మరమ్మతులు చేయాలంటే ముందుగా డ్యాం సేఫ్టీ అధికారులు వచ్చి ప్రాజెక్టు కట్ట పటిష్ఠతను పరీక్షించాల్సి ఉంటుంది. తదుపరి వారు ఇచ్చిన నివేదిక ప్రకారం ఏమేరకు మరమ్మతులు చేపట్టాలన్న విషయాన్ని నిపుణులతో చర్చించి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంటుంది.



చిరిగిపోయిన ఇసుక బస్తాలు

ప్రతిపాదనలకు కసరత్తు:

బాలరాజు, ఈఈ, నీటిపారుదలశాఖ నల్గొండ

ఉదయసముద్రం రిజర్వాయర్ కట్ట దెబ్బతినకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నాం. శాశ్వత పనుల నిర్వహణ కోసం డ్యాం సేఫ్టీ అధికారులతో పరీక్షలు నిర్వహించేందుకు ప్రక్రియ చేపడుతున్నాం. వారు ఇచ్చిన నివేదిక తర్వాత ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తాం.

మీ-టికెట్‌తో ప్రయాణం సులభం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. నల్గొండ నుంచి దిల్‌సుఖ్‌నగర్ నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించే వారు మీ-టికెట్ యాప్ ద్వారా స్వయంగా టికెట్ తీసుకునే విధానానికి శ్రీకారం చుడుతోంది. బస్సు ప్రవేశమార్గంలో ఏర్పాటు చేసే క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే చాలు.. టికెట్ బుకింగ్ ప్రక్రియ మొదలవుతుంది. బస్సు ఎక్కేదిగే ప్రాంతాల వివరాలు నమోదు చేసి.. ఆన్‌లైన్‌లో చెల్లింపు పూర్తిచేస్తే వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. దాన్ని డ్రైవర్‌కు చూపిస్తే చాలు.

సెప్టెంబరు 2 నుంచి...

నల్గొండ నుంచి దిల్‌సుఖ్‌నగర్ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి సెప్టెంబరు 2వ తేదీ నుంచి క్యూలైన్‌లో నిలబడే అవసరం లేకుండా మీ -టికెట్ యాప్‌ను ఆర్టీసీ ప్రారంభిస్తుంది. ముందుగా నల్గొండ-దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తుంది. ఈ మార్గంలో ప్రస్తుతం రోజుకు 50 నాన్‌స్టాప్ డీలక్స్ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ఇది విజయవంతమైతే వచ్చే నెలాఖరులోగా మిగతా రూట్లలో అమలు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తోంది.

వాతావరణంలో మార్పు.. వ్యాధుల ముప్పు



జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో గత కొద్ది రోజులుగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. రోగులు పెద్ద ఎత్తున ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఎల్‌నినో నేపథ్యంలో అనూహ్య వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు కురవక పోవడంతో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు పగలు, రాత్రి 33 నుంచి 24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆస్తమా, ఒళ్లునొప్పులు, తలనొప్పి, జ్వరం, చర్మవ్యాధులతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. బాధితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఎక్కువ మంది ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

ఉష్ణోగ్రతలు ఇలా

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
26	33.1	22.4
27	33.5	23.4
28	32.5	23.4
29	32.0	23.6
30	32.1	24.1

జాగ్రత్తలు పాటించాలి: డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

ప్రస్తుత వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వేడి అధికంగా ఉండటంతో అప్రమత్తంగా ఉండాలి. ప్రతినిత్యం 4 నుంచి 5 లీటర్ల నీటిని తాగాలి. ఇంట్లో వండిన ఆహార పదార్థాలు తినేందుకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. జిల్లాలో ఉన్న ఏరియా ఆసుపత్రులతో పాటు ఇతర ఆసుపత్రులకు వస్తున్న బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయి.

ఆర్టీసీ సేవ.. సాంకేతిక తోవ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు ఆర్టీసీ సాంకేతికంగా పలు వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఆయా డిపోల్లో ఆన్‌లైన్ చెల్లింపుల నుంచి.. బస్సు ఎక్కడుందో తెలుసుకోవడం వరకు పలు సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పాటు.. పర్యావరణ హిత విద్యుత్తు బస్సులను, అందులో సీసీ కెమెరాలు వంటి సదుపాయాలు సైతం కల్పిస్తూ దూసుకుపోతోంది. మిర్యాలగూడ, నల్గొండ వంటి డిపోల్లో ముందస్తు ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం సైతం అందుబాటులో ఉంది. తాజాగా స్మార్ట్ టికెట్ విధానాన్ని సైతం ప్రారంభించేందుకు ఆర్టీసీ సన్నద్ధమైంది.

ఉమ్మడి జిల్లాలో డిపోలు ఇవీ..
నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, దేవరకొండ, యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి.


మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

స్మార్ట్ టికెట్ పని చేసే విధానం ఇదీ..

✦ తొలుత బస్సులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి.
✦ అనంతరం మీ టికెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
✦ మీ టికెట్ యాప్‌ను తెరచి టీజీఆర్టీసీ కరెంట్ బుకింగ్ ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాలి. ✦ ప్రయాణం, ప్రయాణికుల వివరాలు నమోదు చేయాలి.
✦ బుకింగ్‌ను నిర్ధారించడానికి చెల్లింపును పూర్తి చేయాలి.
✦ చెల్లింపు నిర్ధారణ తరువాత ఒక క్యూఆర్ కోడ్ వస్తుంది.
✦ ఇది వరకే మీ టికెట్ యాప్ ఉన్న వారు.. మీ టికెట్ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా బస్సు లోపల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. కరెంట్ బుకింగ్ ఐచ్ఛికం కనిపిస్తుంది. అక్కడ వివరాలు నమోదు చేసి.. టికెట్ పొందొచ్చు.

యూపీఐ చెల్లింపులు...

ప్రస్తుత డిజిటల్ యుగంలో అధిక శాతం మంది యూపీఐ, ఆన్‌లైన్ చెల్లింపులకు మొగ్గు చూపుతున్నారు. దీంతో బస్సుల్లో టికెట్ తీసుకునేందుకు చిల్లర సమస్య తలెత్తకుండా యూపీఐ చెల్లింపులను ప్రవేశ పెట్టింది. దీని కోసం ఆధునాతన టిమ్ యంత్రాలను సైతం తీసుకొచ్చింది. వీటి ద్వారా ప్రయాణికులు యూపీఐ స్కానర్‌ను స్కాన్ చేసి.. టికెట్ ఛార్జీ చెల్లించవచ్చు. ఇది ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంది.

బస్సు ఎక్కడుందో..?

ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సు ఎక్కడుందో తెలుసుకోవడం కష్టంగా ఉండేది. బస్టాండ్‌లో సిబ్బందిని అడిగినా సరైన సమాధానం వచ్చేది కాదు. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. దీనిని నివారించేందుకు ఆర్టీసీ 'గమ్యం' పేరుతో ఒక యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఈ యాప్‌లో బస్సు నెంబర్, రూట్ నెంబర్ ఆధారంగా బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. బస్సు బస్టాండ్‌కు ఎప్పుడు చేరుతుందో యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి...

– జ్యోత్స్న, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ



సాంకేతిక పరంగా ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ రిజర్వేషన్‌తో పాటు.. యూపీఐ చెల్లింపులు, గమ్యం యాప్ వంటివి ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. తాజాగా రానున్న స్మార్ట్ టికెట్ విధానం సైతం సమయాన్ని ఆదా చేయడంతో పాటు.. చిల్లర సమస్యకు చెక్ పెడుతుందని ఆశిస్తున్నాం.

ఆటకు.. ఆరు గంటలు

రాజాపేట, ఆలేరు, న్యూస్‌టుడే: అండర్-19 భారత క్రికెట్ జట్టుకు రాజాపేట మండల కేంద్రానికి చెందిన కుర్రాడు ఊట్కూరి యశ్వీర్‌గౌడ్ రెండో సారి ఎంపికయ్యాడు. తాజాగా సెప్టెంబరు 18, 21, 23 తేదీల్లో ఆస్ట్రేలియా జట్టుతో జరగనున్న వన్డే క్రికెట్ పోటీల్లో భారత తరఫున ఆడనున్నాడు. అంతకు ముందు గత జులై 1 నుంచి శ్రీలంకతో జరిగిన మూడు వన్డే సిరీస్‌లోనూ యశ్వీర్ పాల్గొని ప్రతిభ చూపడం విశేషం.


బౌలింగ్ చేస్తున్న ఊట్కూరి యశ్వీర్‌గౌడ్

✦ హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ఈ యువకుడు రాజ్‌కుమార్, వాణి కుమారుడు. చిన్న వయసు నుంచే తన కుమారుడు క్రికెట్ ఆట పట్ల ఉన్న మక్కువను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు ఆ రంగంలో తర్ఫీదు ఇప్పించారు. స్థానికంగా 'భవన్స్' అకాడమీలో చేర్పించారు. కోచ్ కృష్ణమోహన్ తర్ఫీదు, మెలకువలు నేర్పిన కారణంగా యశ్వీర్ ఇప్పటి వరకు పలు ట్రోఫీల్లో 50 కిపైగా మ్యాచ్‌లు ఆడి ప్రతిభ చూపడం విశేషం.

✦ అండర్-16 విభాగంలో 2023-24లో బీసీసీఐ ట్రోఫీలో ఆడిన 5 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు, 125 పరుగులను తీయడం విశేషం. అలాగే అండర్-19 విభాగంలో రంజీ ట్రోఫీలో రాజ్‌కోట్‌లో ఆడిన వన్డే మ్యాచ్‌లోనూ ఏకంగా 6 వికెట్లు పడగొట్టిన ఘనత ఈ యువకుడి సొంతం. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (అండర్-19) కేరళ రాష్ట్ర జట్టుతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఎనిమిది వికెట్లు తీసుకుని జట్టు గెలుపులో కీలకమయ్యాడు. ఈ మ్యాచ్‌లో తన బ్యాటింగ్ ప్రతిభను కూడా చూపే క్రమంలో 118 పరుగులను సాధించి ప్రత్యర్థి జట్టును చిత్తు చేశాడు. రోజులో కనీసం 6 గంటలు మైదానంలో క్రికెట్ సాధన చేపడుతున్న ఈయనకు అటు క్రికెట్, ఇటు చదువుపైనే తన పూర్తి ధ్యాస అంటున్నాడు.

ఆధునిక వంటశాల ఏర్పాటుకు సన్నాహాలు

నడిగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహారం కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సిద్ధం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కిచెన్ నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను విద్యా మౌలిక సదుపాయాల కల్పన విభాగం పర్యవేక్షణ చేయనుంది. సూర్యాపేట కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న కిచెన్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నారు. గతంలో పాఠశాల విద్యార్థులకే అందుబాటులో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు అమలు చేయనుంది. మోడల్ ప్రాజెక్ట్‌గా కొన్ని జిల్లాల్లో అమలులో ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిధిలో తొలిసారిగా ఏర్పాటు చేసిన పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 56 కళాశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. నవంబరు మొదటి వారం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించారు. సూర్యాపేటలోని సమీకృత మార్కెట్ ఆవరణలో కిచెన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండు నెలల్లో పూర్తి చేసి విద్యార్థులకు అందించాలనేది లక్ష్యం.

మెనూ ఇలా..

విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్ సూచనల మేరకు మెనూ రూపొందించారు.
సోమవారం: ఇడ్లీ సాంబార్
మంగళవారం: పూరీ, ఆలుకూర్మ
బుధవారం: దోశ, చట్నీ
గురువారం: ఉప్మా చట్నీ
శుక్రవారం: మిల్లెట్ ఇడ్లీ, సాంబార్
శనివారం: బోండా, చట్నీ

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు..

జిల్లా	కళాశాలల సంఖ్య
నల్గొండ	27
యాదాద్రి	17
సూర్యాపేట	8

ప్రజలకు చేరువగా.. సేవలు మెరుగ్గా

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ చాట్‌బాట్‌కు కృత్రిమ మేధ (ఏఐ) అనుసంధానం చేసింది. విద్యుత్తు కార్యాలయాలకు వెళ్లకుండానే అవసరమైన పూర్తి సమాచారం తమ చరవాణి నుంచే తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. 24 గంటలు, ఏడు రోజుల పాటు నిరంతరాయంగా ఉండేలా తీర్చిదిద్దారు.

◆ చరవాణిలో వాట్సాప్ ద్వారా నంబరును సంప్రదించి హాయ్ అనే సందేశం పంపించగానే టీజీఎన్‌పీడీసీఎల్ కస్టమర్ సపోర్ట్‌కి స్వాగతం! మీ విద్యుత్తు సేవల్లో మీకు సహాయం చేయడానికి మేము సంతోషంగా ఉన్నాం.. మీకు ఈ రోజు ఏ విధంగా సహాయం చేయగలం? అని సందేశం వస్తుంది. బిల్లుల వివరాలు, చెల్లింపు స్థితి, విద్యుత్తు అంతరాయ సమాచారం, ఫిర్యాదు నమోదు, కొత్త కనెక్షన్ ప్రక్రియ, కేటగిరీ మార్పు ప్రక్రియ, పేరు మార్పు ఇలా పలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

1912కు సమాచారం ఇస్తే...

జిల్లాలో సుమారు 6 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం సర్కారు, ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ మండలి ఒక దరఖాస్తు పలు ప్రయోజనాలు అనే దానిని తీసుకొచ్చి సేవలను మరింత విస్తృతం చేసింది. స్థానికంగా ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందజేస్తే ఆ ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత అధికారులకు చేరవేసేలా సాంకేతికతను రూపొందించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని పరిష్కరించేలా తీర్చిదిద్దారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ విద్యుత్తు డీఈ శ్రీనివాసాచారి కోరారు.

అమ్మాయిల చదువుకు ఆసరా

నాంపల్లి, చండూరు, న్యూస్‌టుడే: అమ్మాయిలూ ఇది మీ కోసమే.. ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థినులకు 'కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2026-27' పేరుతో ఉపకార వేతనాలను అందిస్తోంది. అందుకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఈ నెల 31తో ముగుస్తుంది.

మీ కోసం

■ **ఇవీ అర్హతలు..:** నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలు మించని వారంతా అర్హులే. ఇంటర్‌లో 75శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, 2026-27 విద్యా సంవత్సరంతో మొదటి ఏడాది ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ వంటి కోర్సుల్లో చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత సాధిస్తే ఏడాదికి రూ.1.50 లక్షల చొప్పున కోర్సు పూర్తి చేసేవరకు ఉపకార వేతనంగా కోటక్ ఫౌండేషన్ అందించనుంది.

■ **దరఖాస్తు ఇలా..:** ఇందుకు ఆన్‌లైన్‌లో kotakeducationfoundation.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి kotakkanyascholarship2026-27 పై క్లిక్ చేసి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుటుంబ ఆదాయ ధ్రువపత్రం, కళాశాల నుంచి పొందిన ఫీజు వివరాల పత్రం, కళాశాల నుంచి బోనఫైడ్ ధ్రువపత్రం, కళాశాలలో ప్రవేశ అనుమతి లేఖ, ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వంటి వివరాలతో నమోదు చేసుకోవచ్చు.

వాహనాల బారులు



చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో ట్రాఫిక్ కష్టాలు ఆదివారం మరింత పెరిగాయి. రద్దీ మూలంగా కిలోమీటర్ల దూరం నిలిచిపోయిన వేల సంఖ్యలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. స్థానికంగా జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం జరుగుతున్నందున కొన్ని నెలలుగా సర్వీసు రోడ్డుపైకి వాహనాలను మళ్లించారు. ఇరుకైన సర్వీసు రోడ్డుపై వందల కొలదీ వాహనాలు, స్థానిక పాదచారులు రాకపోకలు సాగించడానికి నిత్యం నరక యాతన పడుతున్నారు. దీనికి తోడు ఆదివారం చౌటుప్పల్‌లో వార సంతను జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తుంటారు. స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పరిశ్రమల్లో ఉపాధి కోసం వలసొచ్చిన పొరుగు రాష్ట్రాల కూలీలు సంతలో సరకుల కొనుగోళ్ల కోసం వస్తారు. మరో దారిలేక సర్వీసు రోడ్డులోంచే వాహనాలను తప్పించుకుంటూ జాతీయ రహదారిని ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సి వస్తుంది. జాతీయ రహదారి పక్కనే కల్యాణ మండపాలున్నాయి. ఆదివారం ఈ మండపాల్లో నిర్వహించిన శుభకార్యాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజలు, వాహనాలతో లక్కారం ప్రాంతంలోని సర్వీసు రోడ్డు కిక్కిరిసింది. అక్కడి అండర్‌పాస్‌లో వాహనాలు ముందుకు, వెనక్కు కదలలేని పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో అక్కడికొచ్చిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కారులోంచి కిందికి దిగి వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కొద్దిసేపు శ్రమించారు. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు శ్రమించారు.

ఆదర్శమవనున్న పాఠశాలలు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది నుంచి ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలన్న యోచనలో ఉంది. ఇందుకుగాను విద్యాశాఖ ఇటీవల ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపింది. ఈ విధానం ప్రవేశపెడితే పిల్లల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధిస్తున్నారు. అదనంగా ప్రీప్రైమరీతో పాటు 1-5 వరకు తరగతులనూ ప్రారంభించాలన్న ఆలోచన ఉంది. అయితే ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలన్నీ చాలా వరకు ఊరికి దూరంగా ఉండటంతో రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గురుకులాలు, కస్తూర్బాలు పెరగడంతో వీటిల్లో చేరే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ సిలబస్‌తోపాటు ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు తరగతులను ప్రారంభిస్తే ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంటుందని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ప్రభుత్వం నుంచి త్వరలోనే ఆమోదం వచ్చే అవకాశాలున్నట్లు దేవరకొండ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆశీర్వాదం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో చాలా వరకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులే అధికంగా ఉండటంతో ఈ విధానంతో వారికి లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.

జిల్లా	ఆదర్శ పాఠశాలలు
నల్గొండ	17
సూర్యాపేట	09
యాదాద్రి	07

అక్టోబరు 18న యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మహిమ, శంకర్, విజయానంద్, అర్జున్, విక్రమ్ సాగర్, రాజా, రమణ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: యువతలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు పసాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఉచిత 'యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ సాగర్ పసాలా, సహ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అర్జున్ మదాసు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వారు కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో విద్యార్థులు, యువత, విద్యావేత్తలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ ప్రతినిధులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, నాయకత్వం, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫౌండేషన్ పిల్లలు, యువత, మహిళలు, రైతులు, వృద్ధులకు విద్య, సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సామాజిక అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫెస్ట్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ సీఈవో గోకుల్ రమణ, ప్రోగ్రామ్ డైరెక్టర్ రాజా, రీజినల్ కోఆర్డినేటర్ పసాలా విజయానంద్, ప్రతినిధులు శంకర్, జి.మహిమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భళా.. శ్రీవిద్య



మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరుకు చెందిన తాపీ మేస్త్రీ బోడ శ్రీరాములు కుమార్తె శ్రీవిద్య యూజీసీ నెట్-జేఆర్ఎఫ్ జూన్ 2026 పరీక్షల్లో 98.4 పర్సంటేజ్ సాధించి ప్రతిభ చాటింది. చిన్న వయస్సు నుంచే విద్యలో రాణిస్తున్న ఆమె ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనభ్యసించి డీఆర్‌డీఏ ద్వారా కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్య, ఉపకార వేతనాలతో ఇంటర్ పూర్తి చేసింది. పీజేటీఎస్ఏయూలో ప్రభుత్వ విద్యనభ్యసించి బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసింది. రాయపూర్‌లో ఐజీకేవీలో ప్రభుత్వ సీట్‌తో ఎమ్మెస్సీ చదివింది. ప్రస్తుతం ఈ-సెట్‌లో ఆరో ర్యాంకు సాధించి రాయపూర్ ఐజీకేవీలో జనటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో పీహెచ్‌డీ చేస్తుంది. 2025లో ఏఎస్ఆర్‌బీ నెట్, యూజీసీ నెట్- అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత సాధించిన శ్రీవిద్య తాజాగా ఈజీసీ నెట్-జేఆర్ఎఫ్‌లో 98.4 పర్సంటేజ్ సాధించినట్లు తెలిపింది. ప్రభుత్వ ఉచిత విద్య, ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని ఆమె అభిప్రాయపడ్డారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో ఇద్దరు వ్యక్తులను హత్య చేసిన కేసులో నిందితులు భూక్యా రాము, భూక్యా పెద్ద బాబు, భూక్యా లక్ష్మీలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదివారం వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుల ఇంటి పక్కనే అమరబోయిన వెంకటేశ్వర్లు ఇల్లు ఉంది. ఆ ఇంటి వేపచెట్టు ఎండిపోయి ఆకులు, కాయలు, దాని నీడ వీరి ఇంట్లో పడి వీరికి కలిసి రావడం లేదని, దానిని తొలగించాలని వెంకటేశ్వర్లుకు చెప్పారు. ఈ విషయంలోనే వీరి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాలపైనా కేసులు అయ్యాయి. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్వర్లును చంపితేనే సమస్య తీరుతుందని నిందితులు కుట్ర పన్నారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం శనివారం వెంకటేశ్వర్లు ఇంట్లో ఉండగా అతన్ని చంపాలని లక్ష్మీ తన ఇద్దరు కొడుకులు రాము, పెద్ద బాబులను రెచ్చగొట్టింది. ఈ క్రమంలో వారిద్దరు వెంకటేశ్వర్లు ఇంట్లోకి ప్రవేశించి వెంకటేశ్వర్లు తలపై గొడ్డలితో దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో వారిని వారించబోయిన వారి తండ్రి భూక్యా సైదులుపై దాడి చేశారు. తమ తండ్రి కూడా వెంకటేశ్వర్లుకు సపోర్టు చేస్తున్నారని తండ్రిపై అక్కసు వెళ్లగక్కారు. తండ్రిని చంపి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులపై కేసు పెట్టాలని ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో గొడ్డలి, కర్రలతో కొట్టడంతో సైదాకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కోదాడ ఇన్‌ఛార్జి సీఐ రామకృష్ణారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, చిత్రంలో నిందితులు

మత్తు..గమ్మత్తుగా గుర్తింపు


పేటెంట్ సంస్థ డైరెక్టర్ శంకర్‌రావు నుంచి జ్ఞాపిక అందుకుంటున్న వసంతారాణి పోతబత్తిని

మఠంపల్లి, న్యూస్‌టుడే: మేధోసంపత్తి రంగంలో నిజామాబాద్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ మహిళా కళాశాల డీఎల్ డాక్టర్ వసంతారాణి పోతబత్తిని 'ఓరల్ డ్రగ్ డిటెక్షన్ డివైస్' నూతన ఆవిష్కరణకు భారత ప్రభుత్వం నుంచి డిజైన్ పేటెంట్‌ను పొందారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన పోతబత్తిని యాకోబు, శాంతమ్మ దంపతుల కూతురు వసంతారాణి ఎంఏ, బీఎడ్, పీహెచ్‌డీ పూర్తి చేసి అదే కళాశాలలో ప్రస్తుతం చరిత్ర విభాగానికి హెచ్‌వోడీగా ఉన్నారు. రక్తం, మూత్రం నమూనాల ద్వారా కాకుండా లాలాజలాన్ని(ఓరల్ ఫ్లూయిడ్) పరీక్షించి క్షణాల్లోనే మత్తు పదార్థాలను తీసుకున్న వారిని గుర్తించే పరికరం కనుగొన్న ఆమెకు ఈ అరుదైన గౌరవం లభించింది. నోటి ఉమ్మి నమూనా ఆధారంగా ఆన్-సైట్ ప్రాథమిక డ్రగ్ స్క్రీనింగ్ చేయడానికి ఇది దోహద పడుతుంది. దీని ఆకృతి, నిర్మాణం, బాహ్య రూపకల్పన వంటి ప్రత్యేకతలకు డిజైన్ రిజిస్ట్రేషన్ లభించినట్లు వసంతారాణి పేర్కొన్నారు.

వినియోగ రంగాలు.. ప్రయోజనాలు

డిజిటల్ డిస్‌ప్లే ద్వారా ఫలితాలను వెంటనే తెలుసుకునేలా ఏఐ, ఎల్‌టీఈ, బ్లూటూత్, డేటా ఎనాలిటిక్స్ వంటి అధునాతన సాంకేతికతను అనుసంధానించి రిమోట్ మానిటరింగ్ చేసేలా దీనిని మరింత అభివృద్ధి చేయవచ్చు. రవాణా, లాజిస్టిక్స్, పాఠశాలల, బస్సు డ్రైవర్ల భద్రతా తనిఖీలు, పరిశ్రమల్లో కార్మికులను పరీక్షించేందుకు వినియోగించవచ్చు. ప్రమాదకర డ్రగ్స్‌పై విద్యాసంస్థలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ ఇవ్వడానికి వీటిని ఉపయోగిస్తారు.

ఎలా పని చేస్తుందంటే...

ఈ పరికరం వ్యక్తి ఉమ్మి ద్వారా పని చేస్తుంది. రక్తం, మూత్ర పరీక్షలతో పోలిస్తే ఇది సులభంగా, వెంటనే నమూనా సేకరించగలిగే పద్ధతి. పరికరంలో ముందుగానే అమర్చిన ప్రత్యేక స్ట్రిప్స్ ఉంటాయి. నోటి నమూనాలో మత్తు పదార్థాల గుర్తులు ఉంటే అవి రియాజెంట్లతో చర్య జరుపుతాయి. డ్రగ్స్ ఉనికిని బట్టి పరికరం టెస్ట్ లైన్‌పై రంగు మారడం, లేదా మార్కింగ్స్ వస్తాయి. దీంతో మత్తుపదార్థాలు తీసుకున్నారా.. లేదా అనే విషయం ప్రాథమికంగా గుర్తించవచ్చు. ఇది తక్షణ ఫలితాలను ఇచ్చే ప్రాథమిక స్క్రీనింగ్ పరికరం.

మార్గదర్శకులు ఎందరో...


ఓరల్ డ్రగ్ డిటెక్షన్ డివైస్ పరికరం

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా ఉండాలన్నది తన అభిప్రాయమని వసంతారాణి చెప్పారు. ప్రస్తుత గుర్తింపు మరింత బాధ్యతను పెంచినట్లు తెలిపారు. సుమారు 10 నెలల కఠోర శ్రమ వెనుక ఎందరో మార్గదర్శకులు, సహచరులు ఉన్నట్లు వెల్లడించారు. మేధో సంపత్తి హక్కులను పొందాల్సిన అవసరం నేటి యువతపై ఉందని చెప్పే డా.ఎంఎస్‌కే రావు రీసెర్చ్ అండ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ డైరెక్టర్ డా.శంకర్‌రావు ముంజం తనకు స్ఫూర్తి అని తెలిపారు.

ముగిసిన అత్యాపత్య రాష్ట్ర స్థాయి పోటీలు

◆ బాలురలో హైదరాబాద్.. బాలికల్లో నాగర్‌కర్నూల్ విజయం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. రంగారెడ్డి (ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో.. నిర్మల్ (ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా. . క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్ముకశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం?

దామరచర్ల, మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగురాలిపై అత్యాచారం జరిగిన ఘటన నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ఓ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు (52) తన తల్లితో కలిసి నివాసం ఉంటోంది. ఆదివారం ఉదయం బాధితురాలి తల్లి మిర్యాలగూడలోని ఆసుపత్రికి వెళ్లింది. దివ్యాంగురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మధ్యాహ్నం సమయంలో ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఆమె కాళ్లు, మెడకు తాడుతో కట్టేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు వెళ్లేటప్పుడు బయటి నుంచి తలుపు వేసి గొళ్లెం పెట్టి తాడుతో కట్టాడు. మిర్యాలగూడలోని ఆసుపత్రికి వెళ్లి వచ్చిన దివ్యాంగురాలి తల్లి ఇంటి తలుపునకు గడియ పెట్టి, దానికి తాడుకట్టి ఉండటంతో కుమార్తెను పేరు పెట్టి పిలవగా ఇంట్లో నుంచి మూలుగులు వినిపించాయి. ఇరుగు పొరుగు వారి సాయంతో తలుపు తెరిచి చూడగా తాళ్లతో కట్టి, ముఖానికి దెబ్బలతో ఉన్న కుమార్తె కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీం సహాయంతో వివరాలు నమోదు చేసుకున్నారు. దివ్యాంగురాలిని వైద్య పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. దివ్యాంగురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ సందర్శించారు. ఆయన వెంట వాడపల్లి ఏఎస్సై జోజి ఉన్నారు.

నల్గొండ
• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

తిరుగు పయనంలో వాహనాల రద్దీ



కేతేపల్లి, న్యూస్‌టుడే: మూడు రోజుల సెలవులు ముగించుకొని రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి వెళ్లే వాహనాలతో జాతీయ రహదారి ఆదివారం సాయంత్రం పోటెత్తింది. రాఖీ పండగతో పాటు వివాహాలు, శుభకార్యాలు అధికంగా ఉండటంతో వారాంతంలో మూడు రోజులక్రితం సొంతూళ్లకు వెళ్లారు. సోమవారం కార్యాలయాలు, పనులకు వెళ్లే వారంతా తమతమ వాహనాల్లో తిరుగు పయనమయ్యారు. విజయవాడ వైపునుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలతో 65వ నంబరు జాతీయ రహదారి కిక్కిరిసి పోయింది. కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామశివారులో ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఉన్న ఆరు లేన్లలో బారులుతీరాయి. మరో లేన్‌లో హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలను అనుమతించారు. సోమవారం ఉదయం కూడా రద్దీ ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పోలీసు శాఖ... ఉత్తమ ప్రతిభ

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: క్రైమ్ పారామీటర్ల అమలులో జిల్లా పోలీసు శాఖ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఛార్జిషీట్, డిజిటల్, కన్విక్షన్ రేటు, సగటు దర్యాప్తు సమయం, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్, ఈపెట్టీ కేసులు, ఈ చలాన్లు, డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో సమగ్ర పని తీరుతో క్లస్టర్-3లో జిల్లాకు అగ్ర స్థానం రావడంతో పోలీసు అధికారులు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో క్రైమ్ పారామీటర్ల అమలు, పోలీసుశాఖ పని తీరుకు సంబంధించి హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ చేతులమీదుగా జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జిల్లాకు ప్రత్యేక గుర్తింపు రావడంతో జిల్లాలోని పలు ర్యాంకుల్లో సిబ్బంది ఆదివారం సంబరాలు చేసుకున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

నకిరేకల్(శాలిగౌరారం), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం అమలుచేయాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లకపాక రాజు డిమాండ్ చేశారు. శాలిగౌరారం మార్కెట్‌యార్డులో పంచాయతీ కార్మికుల యూనియన్ సమావేశంలో ఆదివారం మాట్లాడారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సదుపాయాలు కల్పించి వేతనాలు నేరుగా ఖాతాల్లో జమచేయాలన్నారు. యూనియన్ నాయకులు బి.నర్సింహా, జి.వెంకటయ్య, ఎస్.జ్యోతిబసు, ఎస్.వెంకటయ్య పాల్గొన్నారు.

భారాస ఆధ్వర్యంలో నిరసనలు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించబోయే కార్యక్రమాల గురించి తెలి



మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి, చిత్రంలో నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు తదితరులు

పారు. సెప్టెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భారాస నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీరా పంకజ్ యాదవ్, మందడి సైదిరెడ్డి, కరీంపాషా, తుమ్మల లింగస్వామి, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆహ్లాదం కరవు



కళావిహీనంగా చర్లపల్లి అర్బన్ పార్కు

నల్గొండజిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండ నగర పరిధిలోని చర్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు నిర్వహణ అధ్వానంగా మారుతోంది. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్కు ప్రారంభానికి ముందే కళావిహీనంగా మారింది. నిర్మాణంలో లోపాల కారణంగా పచ్చదనం కనుమరుగైంది. చిన్నపాటి వర్షం పడితే పూర్తిగా వరద నీటిలో మునిగిపోతోంది. నేటికీ పార్కును ప్రారంభించని కారణంగా నగర ప్రజలకు ఆహ్లాదం కరవైంది.

◆ కళావిహీనంగా మారి..

పార్కు నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో అది నేడు కళావిహీనంగా మారింది. పార్కు పనులు పూర్తి చేసి రెండున్నరేళ్లు దాటినా అందులో చేపట్టిన సుందరీకరణ పనుల ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోతోంది. ఆర్టిఫిషియల్ బొమ్మలు రంగులను కోల్పోతున్నాయి. ఏర్పాటు చేసిన తివాచీ, పచ్చని పూల మొక్కలు ఎండిపోయి కనుమరుగయ్యాయి. పార్కు ముందు భాగంలో నాటిన వెదురు పోలిన మొక్కలు సైతం నిర్వహణ లేమి కారణంగా ఎండిపోయాయి. పార్కు ఎదుట ఏర్పాటు చేసిన దుకాణ సముదాయం, శౌచాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిపోయాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి పార్కులో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.కోట్ల నిధులు వృథా...

నగర సుందరీకరణలో భాగంగా చర్లపల్లి వద్ద దేవరకొండ రహదారికి చెందిన భూమిని అటవీశాఖ కలాపతితో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు లీజుకు తీసుకున్నారు. 2022లో సుమారు రూ.1.5 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకారం చుట్టిన అర్బన్ పార్కు పనులు, అధికారుల అనాలోచిత నిర్ణయాలు గుత్తేదారు అంచనాల కారణంగా అంచనామారయ్యాయి. దీంతో ఏకంగా పార్కు అభివృద్ధి వ్యయం సుమారు రూ.4 కోట్లకు చేరువైంది. ఆర్టిఫిషియల్ బొమ్మల పేరుతో గుత్తేదారులు అధికారులు రూ.లక్షల్లో నిధులు జేబుల్లోవేసుకున్నారని ఆరోపణలు అప్పట్లో వ్యక్తమయ్యాయి.

వరిపంట బోనస్‌కు ఆన్‌లైన్ గడువు పెంపు

తిప్పర్తి, న్యూస్‌టుడే: వరిసాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించనున్న క్వింటాకు రూ.500 బోనస్ దరఖాస్తు గడువును సెప్టెంబరు 10 వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి సన్నీరాజ్ తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన ఏడు రకాల వంగడాలను సాగుచేసిన రైతులకు మాత్రమే ఈ బోనస్ లబ్ది చేకూరుతుందని ఏఈవో స్పష్టం చేశారు. ధాన్యం విక్రయించే సమయంలో కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డిజిటల్ పంటల సర్వే నమోదుకు రైతులు సహకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం వచ్చే సర్వే సిబ్బందికి సాగు వివరాలు అందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

80085 52710 (నల్గొండ), 80085 74421 (నకిరేకల్), 80085 66199 (మునుగోడు), 80085 74385 (చిట్యాల)

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? నగరంలోని మునుగోడు రోడ్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో అంతర్గత రోడ్డు, మురుగు కాల్వలు అపరిశుభ్రంగా మారాయి. శుభ్రం చేయించాలి. - సరహరి, నల్గొండ

✔ పరిశీలించి వెంటనే శుభ్రం చేయిస్తాం. - శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, నగరపాలక సంస్థ నల్గొండ

సంఘాలు - కార్యవర్గాలు

మెకానికల్ యూనియన్ ఏర్పాటు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ టూవీలర్ మెకానిక్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా రాంపెల్లి నర్సింహాచారి, ఉపాధ్యక్షులుగా కోడి జానకిరాములు, వడ్లకొండ భిక్షం, ప్రధాన కార్యదర్శిగా కొండ శ్రీను, కోశాధికారిగా జి.నరేష్, ప్రచార కార్యదర్శిగా బి.ధనుంజయ, కార్యవర్గ సభ్యులుగా జి.మహేష్, రామకృష్ణ, సైదాచారి, పి.మహేష్ ఆదివారం ఎన్నికయ్యారని సంఘం నాయకులు తెలిపారు.



నిత్య యోగాసాధకుల..

చిట్యాల: శ్రీదత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యయోగా సాధకుల పట్టణశాఖ కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. సంకల్ప క్రియాయోగ గురువు రఘు గురూజీ జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు బాధ్యులు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడిగా బూరుగు కృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా కాచం కృష్ణయ్య, కంచర్ల ఈశ్వరయ్య, నారబోయిన శ్రీనివాస్, పాటి మోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా మాస శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంపాటి నరసింహ, ఉపాధ్యక్షులుగా పొన్నం లక్ష్మయ్య, గాదె ఎల్లేష్, సహాయ కార్యదర్శులుగా కోనేటి సాయిరాం, దాడి అరుణ, సభ్యులుగా చొల్లేటి రవీంద్రనాథ్, మందడి లక్ష్మి, పాలాది రమేష్, కుక్కడపు లక్ష్మి, పందిరి అర్చన ఎన్నికైనట్లు పేర్కొన్నారు.



విద్యార్థులకు క్రీడా పోటీలు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని విపస్య పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక వికాసం లభిస్తుందని, తద్వారా విద్యార్థులు చదువులో రాణిస్తారని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించేవారు అన్ని రంగాల్లో ముందుంటారని తెలిపారు. అనంతరం నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్, గోపి, పీఈటీ కొండల్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న వేముల వీరేశం

నకిరేకల్, న్యూస్‌టుడే: చేతివృత్తిదారుల, కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్ పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం అభినందించి మాట్లాడారు. అర్హులైన చేతి వృత్తిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను త్వరలో మంజూరు చేస్తామన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చౌగోని శ్రీను, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల వెంకన్న, సంఘం అధ్యక్షుడు జి.సైదులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి నిత్యకల్యాణ వైభవం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో కొలువై ఉన్న అర్చామూర్తులను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆచారంగా స్వయంభూ మూర్తులను మేల్కొల్పిన పూజారులు హారతి నివేదన జరిపారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం ఆలయ ఆచారంగా నిర్వహించారు. జోడు సేవోత్సవం జరిపారు.

స్వర్ణగిరిలో నిత్యారాధనలు

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధలను విశేషంగా చేపట్టారు. శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం పద్మావతి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. మహాలక్ష్మీ హవనం జరిపారు. వైభవోత్సవ మండపంలో శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి సేవోత్సవ నిర్వహించారు.

శునకాల స్వైర విహారం

నగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నడిచి, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారి వెంటపడుతున్నాయి. గుంపులుగా చేరి దాడులకు పాల్పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ రోడ్డులో ఏదోఒక చోట నిత్యం దాడులకు పాల్పడుతున్నాయని అంటున్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీటిని ఎప్పటికప్పుడు పట్టుకొని తరలిస్తున్నా తీవ్రత తగ్గడం లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీలగిరి, న్యూస్‌టుడే:



ప్రమాదకరంగా గుంత

మునుగోడు మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కార్యాలయానికి సమీపంలో ఉన్న ఓ కాలనీ మధ్యలోని మ్యాన్‌హోల్ గుంత ప్రమాదకరంగా మారింది. ఎన్నో ఏళ్ల నాటి నుంచి ఉన్న ఈ మ్యాన్‌హోల్ ఇటీవల మూత పగిలి ఆ గుంతలో పూర్తిగా మట్టి నిండింది. దీంతో సరఫరా అయ్యే నీరు రంగు మారి వస్తుంది. గ్రామ పంచాయతీ సిబ్బంది ఆ గుంతలో ఉన్న మట్టిని పూర్తిగా తొలగించారు. కానీ పైన మ్యాన్‌హోల్ మూత ఏర్పాటు చేయలేదు. రోడ్డు మధ్యలో ఉండటం కారణంగా ప్రమాదానికి తావిస్తుంది. మునుగోడు,న్యూస్‌టుడే:



సారూ.. సీసీరోడ్డు నిర్మించరూ

నగరంలోని 9వ డివిజన్ అయ్యప్ప ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో సీసీ లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల యూజీడీ పనులు సైతం చేపట్టారు. పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ప్రస్తుతం ఉన్న తాత్కాలిక మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి యూజీడీ పనులు పూర్తిచేసి సీసీ రోడ్లను నిర్మించాలని కోరుతున్నారు.

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే:



శ్రావణ మాసం.. బోనాల వైభవం



నల్గొండ గ్రీన్‌సిటీ కాలనీలో బోనాలతో ఊరేగింపు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా నగరంలోని 11వ డివిజన్ గ్రీన్‌సిటీ కాలనీలో బోనాల వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా తరలివెళ్లి ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఐతగోని యాదయ్యగౌడ్, మాజీ కౌన్సిలర్ దండెంపల్లి సత్తయ్యగౌడ్, పజ్జూరి పరమేశ్, బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.



సాగర్ రోడ్డులోని తెలంగాణ కాలనీలో పూజలు

చిట్యాల: చిన్నకాపర్తిలో బోనాల వేడుకలను ఆదివారం నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ తల్లికి మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుమ్మర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు తాడూరు చంద్రం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆవుల సుందర్, మాజీ సర్పంచి గంగాపురం భాస్కర్, సంఘం మండలాధ్యక్షుడు పాకాల దినేష్, ఉపాధ్యక్షులు అరూరి శ్రీను, అరూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి: శ్రావణమాసం బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించడానికి నగరంలోని పలు కాలనీల్లో సామూహికంగా బోనాల



చిట్యాల: చిన్నకాపర్తిలో...

ఊరేగింపు చేపట్టారు. సాగర్ రోడ్డులోని తెలంగాణ కాలనీలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవరకొండ రోడ్డులోని కతాల్‌గూడలో అమ్మవారికి బోనం సమర్పించడానికి ఊరేగింపుగా తరలివచ్చారు. పాతబస్తీ, రామగిరి, పానగల్‌లో సందడి నెలకొంది.



కతాల్‌గూడలో...

ప్రమాదంలో మూగజీవాల మృతి

మర్రిగూడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో రెండు మూగజీవాలు మృతి చెందడంతో పాటు మరో రెండింటికి గాయాలైన ఘటన మండల పరిధిలోని సరంపేట గ్రామ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లాకి చెందిన కొంతమంది గొర్ల కాపరులు తమ జీవాలను మేతకోసమని మండల పరిధిలోని పలు గ్రామాలకు తోలుకొచ్చారు. ఆదివారం సాయంత్రం కొట్టం దగ్గరికి ఆయా జీవాలను తీసుకొస్తుండగా ఇందుర్తి గ్రామానికి చెందిన ఓ కారు మర్రిగూడ నుంచి వస్తూ సరంపేటకి దగ్గర గొర్రెలను ఢీకొట్టింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు.

భారాస మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడి మృతి

నాంపల్లి, న్యూస్‌టుడే: గుండెపోటుతో భారాస మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. నాంపల్లి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన మహమ్మద్ సలీం(51) భారాస మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు మర్రిగూడ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భారాస మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సలీం మృత దేహనికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఖర్చుల నిమిత్తం రూ. 1,30,000 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

రాణాలు తళుక్కుమనేలా..



రంగులతో నకిరేకల్ రాణా

నకిరేకల్, న్యూస్‌టుడే: కొత్తగా రంగులు. .పచ్చని చెట్లు..ఆవరణలో కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు..ప్రధాన ద్వారానికి ఇరువైపులా పచ్చికతో ఆహ్లాదాన్ని పంచుతోంది నకిరేకల్ రాణా. స్టేషన్‌కు కొత్త హంగులు కల్పించి ముస్తాబు చేశారు. 2019లో రూ.13 లక్షలతో ఈ స్టేషన్‌ను ఆధునికీకరించారు. ఆ తర్వాత ఇన్నేళ్లకు మళ్లీ రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. స్టేషన్ ఆవరణలో 40 కిపైగా పెద్దపెద్ద వృక్షాలతో పచ్చదనం ఆహ్లాదాన్ని, ఇక్కడకి వచ్చే బాధితులకు నీడనిస్తున్నాయి. ఆవరణలో స్టోర్ రూం నిర్మించేందుకు పెద్ద వేప వృక్షం అడ్డుగా ఉండటంతో దానిని తొలగించకుండా చెట్టు చుట్టూ నిర్మించి కాపాడుతున్నారు.

తిప్పర్తి: తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నతాధికారుల సందర్శన ఉండటంతో ఇటీవల కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై ఇరుగు రవి ప్రత్యేక చొరవ తీసుకొని స్టేషన్ ఆవరణ, గదుల్లో శుభ్రం చేయడంతోపాటు భవనానికి రంగులు వేయించారు. చుట్టూ మొక్కలు నాటించడంతో చూపరులను ఆకట్టుకుంటోంది.



తిప్పర్తి పోలీస్‌స్టేషన్..

ఆరుతడి.. అంతంతే..!

తిప్పర్తి, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగుచేయాలని ప్రభుత్వం సూచించినా చాలామంది రైతులు వరిసాగుకే మొగ్గు చూపారు. వర్షాలులేక క్రమక్రమంగా బోర్లు వట్టిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు.



తిప్పర్తిలో వరిసాగు

క్షేత్రస్థాయిలో అవగాహన కరవు

ఎల్‌నినో నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ అధికారులు అంతగా చొరవ చూపలేదన్న విమర్శలున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభంలో మండల స్థాయిలో సదస్సులు నిర్వహించినా అనంతరం ఏఈవోలు రైతులకు ఆశించిన స్థాయిలో అవగాహన సదస్సులను నిర్వహించలేకపోయారు. దీంతో రైతులు ఎప్పటిలాగే అధికశాతం వరి సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మొదట బాగానే నీటిని అందించిన బోర్లలో నీటిలభ్యత చాలావరకు తగ్గింది. ఆరుతడి పంటలైన కంది, పెసర, మినుము, తదితర పంటలు నియోజకవర్గ వ్యాప్తంగా మూడువేల ఎకరాల లోపు ఉండటం రైతుల్లో అనాసక్తిని తెలియజేస్తుంది.

మండలాలు	వరి (ఎకరాల్లో)	పత్తి	కంది	పెసర	మినుము
నల్గొండ	33000	19800	800	250	50
తిప్పర్తి	28890	4390	600	250	50
కనగల్	27000	8000	400	200	100

మిర్యాలగూడ

•మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

సీఎం ఆదేశాలు హర్షణీయం


మిర్యాలగూడలో హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన ఉద్యమకారుల కుటుంబ సభ్యులతో పాటు.. ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారికి గుర్తించి తగిన న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడం హర్షణీయమని ఉద్యమకారుల ఫోరం మిర్యాలగూడ నాయకులు దశరథ నాయక్, బంటు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని అమరుల స్తూపం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దుర్గయ్య, ఇక్బాల్, క్రాంతికుమార్, మక్లా నాయక్, మహమూద్, శ్రీనివాస్, సైదా తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం



దామరచర్ల, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. దామరచర్ల మండలం కొత్తపేట తండాలో నూతనంగా నిర్మించిన ఇంటిని ఆదివారం ఆయన ప్రారంభించి గృహ ప్రవేశం చేయించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలు, శోభన్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిధులు మంజూరైనా.. రోడ్డు పూర్తికాకపాయె


పల్లిపహాడ్ తెరాటిగూడె రోడ్డు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఇది గుర్రంపోడు మండలంలోని పల్లిపహాడ్ తెరాటిగూడెం మధ్య ఉన్న 4 కిలోమీటర్ల రోడ్డు. బీటీ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.4 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పూర్తి అయి గుత్తేదారుకు అగ్రిమెంట్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైనందున ప్రస్తుత ప్రభుత్వం గ్రాంట్ ఇస్తుందో లేదో అనే అనుమానంతో ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం మొదలు పెట్టలేదు. కానీ అధికారుల అలసత్వం గుత్తేదారు నిరాసక్తత కారణంగా రోడ్డు నిర్మాణం అసలు మొదలు పెట్టని కారణంగా నిధులు వెనక్కి తిరిగి పోయాయి. గుర్రంపోడు మండలం పల్లిపహాడ్ నుంచి తెరాటిగూడెం వరకు కాలిబాట ఉండేది. ఇక్కడ రైతులు తమ పొలాలకు వెళ్లడానికి కూడా ఎంతో ఇబ్బంది పడేవాళ్లు. స్థానికుల డిమాండ్లతో నాగార్జునసాగర్ నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా 2023లో 4 కిలోమీటర్ల పొడవునా ఫార్మేషన్‌తో పాటు కల్వర్టులు నిర్మించి బీటీ వేసేందుకు అప్పటి ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ (రాష్ట్ర అభివృద్ధి నిధులు) కింద రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఇక రోడ్డు వేస్తారని ఆయా గ్రామాల ప్రజలు సంతోషించారు. కానీ వారి ఆశ ఇప్పటికీ తీరలేదు. ప్రభుత్వం మారాక ప్రస్తుత పాలకులు అసలే మర్చిపోయారు. పాత నిధులతో రోడ్డు వేస్తారా లేక కొత్తగా నిధులు మంజూరు చేయించి రోడ్డు వేస్తారా అని ఆ గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆదివారమొస్తే.. సమస్తం వ్యర్థాలే..


శ్రీనివాస థియేటర్ వెనుక వీధిలో..

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్ని వార్డుల్లో పురపాలిక సిబ్బంది ఇంటింటి చెత్త సేకరణ చేపడుతుంటారు. పలు వీధుల్లో ప్రజలు వ్యర్థాలను ఒక చోట కూడలిలో కుప్పగా పోస్తుంటారు. వీటిని పురపాలిక సిబ్బంది వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. అనేక వార్డుల్లో నిరంతరం జరిగే ప్రక్రియ ఇది. అయితే పలు ప్రాంతాల్లో ఆదివారం నాడు వ్యర్థాల సేకరణ జరగదు. దీంతో ప్రజలు పోసిన వ్యర్థాల కుప్పలు ఆదివారం నుంచి సోమవారం వ్యర్థాలను తరలించే వరకు కుప్పలుగా పేరుకుని ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.

అవగాహన ఏదీ..?.. వ్యర్థాలను రోడ్లపై, కూడళ్లలో పడేయొద్దని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నప్పటికీ... ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో..తమ ఇల్లు, దుకాణం వచ్చే వ్యర్థాలను సమీపంలోని కూడలిలో పడేస్తున్నారు. దీంతో భరించలేని దుర్వాసనతో పాటు.. దోమలు వ్యాప్తి చెందుతూ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ కాకుండా కేవలం పురపాలిక వాహనంలోనే పడేయాల్సిన అవసరం ఉంది.


మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో పురపాలిక వాహనం పక్కనే వ్యర్థాల కుప్ప

వాహనం ఉన్నా నేలపైనే.. డాక్టర్స్ కాలనీలో పరిస్థితి వింతగా ఉంది. ఆసుపత్రుల నుంచి వచ్చే వ్యర్థాలను సైతం కాలనీలోని ఓ చోట రోడ్డు పక్కన కుప్పగా పోస్తుంటారు. ఆదివారం నాడు చెత్తను ఎత్తనందున.. రోడ్డుపై పడేయకుండా.. పురపాలిక సిబ్బంది చెత్త వాహనాన్ని ఆ ప్రాంతంలోనే ఏర్పాటు చేశారు. కానీ ఆసుపత్రుల సిబ్బంది మొత్తం వ్యర్థాలను ఆ వాహనం పక్కనే కుప్పగా పడేయడం ప్రజలను విస్మయానికి గురి చేస్తుంది.

కాల్వ నిండా.. శ్రీనివాస థియేటర్ వెనుక సైతం పక్క కాల్వ వెంట నిత్యం వ్యర్థాలను కుప్పగా పోస్తుంటారు. అయితే ఆదివారం కావడంతో ఆ ప్రాంతంలో పడేసిన వ్యర్థాలు పక్క కాల్వలో చేరి.. కాల్వ మొత్తం నిండిపోయింది. దీంతో మురుగునీరు పారేందుకు అడ్డంకిగా మారుతుంది. పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో కూరగాయల వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు, ఇతర వ్యర్థాలను కుప్పగా పోస్తున్నారు.

• వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా ప్రజలు, దుకాణదారులకు అవగాహన కల్పిస్తామని పురపాలిక పారిశుద్ధ్య పర్యవేక్షకుడు రవితేజ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

మిర్యాలగూడ: 77994 92939,
దేవరకొండ: 99121 74975, త్రిపురారం: 97057 45533

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

? ఈదులగూడెం గొల్లగూడెంలో వీధుల్లో గేదెలు కట్టేస్తున్నారు. దోమలు వ్యాపిస్తున్నాయి. – శాంతిప్రియ

✔ యజమానులను హెచ్చరించి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తాం. – రవితేజ, పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి

? ఎన్నెస్పీ క్యాంపులో ఖాళీ స్థలాల్లోని పిచ్చి మొక్కల నుంచి పురుగులు వస్తున్నాయి. – రమ్యకృష్ణ

✔ శుభ్రం చేయించేందుకు పురపాలిక డోజర్ పంపుతాం. – శ్రీజారెడ్డి, కమిషనర్

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలోని డీఎన్టీ హాస్టల్ వద్ద తరచూ సీసీ రహదారిపై మురుగు నీరు నిలుస్తుంది. – కె.శంకరయ్య, దేవరకొండ

✔ హోటల్ నుంచి డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వస్తుంది. ఒక్కసారి వారికి సూచిస్తాం. – సురిగి శంకర్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? మండల పరిధిలోని జప్తివీరప్పగూడెంలో పక్క కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. – నాగరాజు.

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – రమేష్, ఎంపీవో, మిర్యాలగూడ.

? పట్టణంలోని చింతపల్లి ఇందిరమ్మ కాలనీలో ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. – సైదులు.

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – నర్రా శ్రీజారెడ్డి, పుర కమిషనర్, మిర్యాలగూడ.

డాక్టర్ రాములు నాయక్ సేవలు చిరస్మరణీయం

చందంపేట, న్యూస్‌టుడే: డాక్టర్ నేనావత్ రాములు నాయక్ పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం డాక్టర్ రాములు నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా చందంపేట మండలం గన్నెర్లపల్లి గ్రామంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన రాములు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భారాస నాయకులు కేతావత్ బిల్యా నాయక్, టీవీఎన్ రెడ్డి, జర్పుల లోక్య నాయక్, నాయకులు వడ్త్య దేవేందర్, హరిలాల్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సును జయప్రదం చేయండి

గుర్రంపోడు, న్యూస్‌టుడే: సెప్టెంబరు 9న వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పోలేని యాదయ్య మాదిగ అన్నారు. గుర్రంపోడు మండలం తానేదార్‌పల్లిలో ఆదివారం జరిగిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎస్ సమావేశం అనంతరం గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము రమేష్ మాదిగ, మేడి సైదులు, పాల్వాయి నరేష్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



నిడమనూరు, న్యూస్‌టుడే: నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి వ్యవసాయ బావిలో, ఓ వృద్ధురాలి మృతదేహం తేలడం స్థానికంగా ఆదివారం కలకలం లేపింది. ఎర్రబెల్లికి చెందిన పెదమాము ముత్తమ్మ(62)కు సంతానం ఎవరు లేకపోవడంతో, భర్త చనిపోయినప్పటి నుంచి తన ఇంట్లో ఒక్కతే ఉంటోంది. ఆదివారం ఉదయం పది గంటల సమయంలో ఎర్రబెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జూలకంటివారిగూడెంలోని ఓ వ్యవసాయ బావిలో ఆమె మృతదేహం గమనించిన స్థానికులు, గ్రామంలోని ఆమె బంధువులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై విజయ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి, శవ పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోందని బంధువులు తెలిపారు. తన పెద్దమ్మ మృతిపై అనుమానం ఉందని, ఆమె కొడుకు వరుస అయ్యే అదే గ్రామానికి చెందిన పెదమాము ఉపేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాగునీటికి రైతుల తిప్పలు..!


క్రేన్‌తో గేటును ఎత్తే ప్రయత్నం చేస్తున్న రైతులు

నిడమనూరు, న్యూస్‌టుడే: ఎడమ కాల్వతో పాటు నిడమనూరు మండలంలోని మేజర్లకు కూడా శనివారం నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. కాగా ముదిమాణిక్యం ఆయకట్టు రైతులు ఆ నీటిని వాడుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. ముదిమాణిక్యం కాల్వ తూముకున్న రెండు గేట్లలో ఒక గేటు గత ఏడాది విరిగి తూములో నీరు వచ్చే ద్వారం వద్ద ఇరుక్కు పోవడంతో, దాని గుండా ప్రస్తుతం నీటి విడుదల నిలిచింది. ఆ గేటును ఎత్తడానికి ఆదివారం దాని ఆయకట్టు రైతులు క్రేన్ తీసుకొచ్చి గేటు ఎత్తడానికి చాలా ప్రయత్నాలు చేశారు. ప్రస్తుతం కాల్వకు పూర్తి స్థాయిలో నీటి విడుదల కాకపోవడంతో, సమీప గ్రామాల్లో చెరువులు, నీటి కుంటలు నింపేందుకు వీలు లేదని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే అధికారులు స్పందించి గేటును ఎత్తి పూర్తిస్థాయిలో నీటి విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన

నిడమనూరు, న్యూస్‌టుడే: మద్యం తాగి తనిఖీల్లో దొరికిన వ్యక్తిని, ఓ కానిస్టేబుల్ దూషించి, చేయి చేసుకున్నాడని నిడమనూరు పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం ఆందోళన చేశారు. నిడమనూరు పోలీసులు ఆదివారం సాయంత్రం హరికృష్ణ రైస్ మిల్లు సమీపంలో డ్రంకెన్ డ్రైవ్ చేపడుతుండగా అదే సమయంలో పంగవాడిగూడెం గ్రామానికి చెందిన జానకిరాములు ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా పట్టుబడ్డాడు. కాగా పోలీసులకు ఆయనకు జరిగిన వాగ్వాదంలో ఓ కానిస్టేబుల్‌తో ఘర్షణకు దారి తీసింది. జానకీరాములు స్టేషన్‌కు తీసుకురాగా అతని తరుపు బంధువులు కూడా భారీ సంఖ్యలో స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేశారు. కాగా డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికి విధుల్లో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్నాడని, పోలీసులు తెలిపారు.

బీసీ ఐకాస ఆధ్వర్యంలో సన్మానం


లింగంపల్లి చిరంజీవిని సన్మానిస్తున్న బీసీ ఐకాస నాయకులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన మిర్యాలగూడ పట్టణానికి చెందిన లింగంపల్లి చిరంజీవిని బీసీ ఐకాస నాయకులు ఘనంగా సన్మానించారు. బీసీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు శాలువా పూలమాలతో సత్కరించారు. ఐకాస కన్వీనర్ మారం శ్రీనివాస్, దాసరాజు జయరాజు, మురళీ యాదవ్, దుర్గయ్య, వెంకన్న పాల్గొన్నారు.

• సచివాలయంలో పర్యాటక శాఖ ఎస్‌వోగా పదోన్నతి పొందిన మిర్యాలగూడ మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన పానుగోతు రవిని సేవాలాల్ సేన ప్రతినిధులు ఆదివారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు ధనావత్ ప్రకాష్ నాయక్, దస్రు నాయక్, శ్రీను నాయక్, సచిన్, నాగార్జున్, రాందాస్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల జెండా ఆవిష్కరణ

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: పట్టణంలోని రెడ్డి కాలనీలో గణేశ్ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆదివారం యూత్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు జెండా ఆవిష్కరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల పూర్తయ్యే వరకు దీక్షగా పని చేయాలని, వేడుకలను ఘనంగా జరపాలని నిర్ణయించారు. రేపాల పురుషోత్తంరెడ్డి, గణేష్, రాము, శ్రీధర్, అశోక్ పాల్గొన్నారు.


రెడ్డికాలనీలో గణేశ్ ఉత్సవాల జెండా ఆవిష్కరించి వేడుకలు ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అవీ ఇవీ

విజయవంతం చేయాలి.. కొండమల్లేపల్లి: పీఆర్టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న నిర్వహిస్తున్న మహా ధర్నాకు ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలి రావాలని సంఘం మండల అధ్యక్షుడు ఏరుకొండ అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని కోరారు.

జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక... కొండమల్లేపల్లి: పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల గోపాల్ చేసిన సేవలకు గాను బీఆర్ అంబేడ్కర్ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ నుంచి తనకు సందేశం వచ్చిందని, సెప్టెంబరు 5న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సమావేశంలో అవార్డు అందుకోనున్నట్లు గోపాల్ తెలిపారు.

మొక్కలు నాటాలి.. కొండమల్లేపల్లి: మానవ మనుగడ సాఫీగా సాగాలంటే ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని కంటికి రెప్పలా కాపాడాలని చిన్నఅడిశర్లపల్లి సర్పంచి పందుల వెంకటయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యదర్శి వెంకటయ్య, సురేష్, మల్లయ్య పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం.. దేవరకొండ: వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతుల కళ్లలో ఆనందం చూడాలని ఆదివారం దేవరకొండ మండలంలోని సర్పంచులు, రైతులు, గ్రామస్థులు మండల పరిధిలోని మైనంపల్లి పాండవుల బండ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతలకు జలాభిషేకం చేశారు. మైనంపల్లి, శక్రుతండా, అంబటోనిగూడెం గ్రామ సర్పంచులు కొర్ర రాంసింగ్, మోహన్‌లాల్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ యువ దళ ఆవిర్భావ దినోత్సవం.. దేవరకొండ: పట్టణంలో ఆదివారం ఘనంగా శివాజీ యువ దళ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివాజీ వద్ద నగర అధ్యక్షుడు పగిడిమర్రి సతీష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా శివాజీ దళ్ జెండాను ఏర్పాటు చేశారు. ఈ జెండాను మాజీ సర్పంచి పున్న వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ముష్టిపల్లి హరికృష్ణ, అయితరాజు శ్యామ్, నేతాళ్ల వెంకటేష్, గడ్డం శివ, శ్రీను, మణి పాల్గొన్నారు.

వచ్చే నెల 6న బోనాల ఉత్సవాలు.. మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలోని కలాల్‌వాడ ముత్యాలమ్మ ఆలయంలో సెప్టెంబర్ ఆరున బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల సైదులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు బంటు సైదులు తెలిపారు. ఆలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోల శ్రీనివాస్, బంటు గిరి, అవుదారపు మురళి, లింగంపల్లి మట్టయ్య, బంటు రమేష్, కొంక వెంకన్న, కోల రాంబాబు, శేఖర్, నాగేందర్, ఈదయ్య, రవి, భిక్షం పాల్గొన్నారు.

ఆత్మకు నిధులొచ్చాయ్..!


మిర్యాలగూడ: కిష్టాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించేలా అమల్లోకి తెచ్చిన ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ)కు ప్రభుత్వం తిరిగి నిధులు కేటాయించింది. గతంలో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమం కొన్నేళ్లుగా నిధులు కేటాయించక నిలిచిపోయింది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు క్షేత్ర ప్రదర్శనలు, అవగాహన సదస్సులు, మేళాలతో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఆత్మ అమలుకు ఇటీవలే జిల్లాకు రూ.26.08 లక్షల నిధులు మంజూరు చేసింది.

పథకాలపై అవగాహన...

• సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయంతో పాటు ఉద్యాన, పశుసంరక్షణ, మత్స్య పరిశ్రమ వంటి రంగాల్లో రైతులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఆత్మ పనిచేస్తుంది. రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాల సమాచారంతో పాటు బిందు సేద్యపు పరికరాలతో ఆరుతడి పంటల సాగు, వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతు శిక్షణ కేంద్రాలు, పంట పొలాలు, కిసాన్ మేళాల వంటి క్షేత్రస్థాయి పర్యటనలు, సందర్శనలతో సాగులో నూతన విధానాలు, పరిశోధనలపై అవగాహన పెంచనున్నారు.

అనుబంధ విభాగాల్లోకి సిబ్బంది...

కొన్నేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఆ సంస్థ అధికారులు, సిబ్బందిని వ్యవసాయ అనుబంధ విభాగాలకు విధులు అనుసంధానించారు. ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక్కో బీటీఎం (బ్లాక్ టెక్నాలజీ మేనేజర్), ఇద్దరు చొప్పున ఏటీఎం (అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్లు) పని చేస్తున్నారు. వీరిని కొన్నాళ్లుగా ఏఈవోలు లేని గ్రామాలకు ఇన్‌ఛార్జి ఏఈవోలుగా, కార్యాలయాల్లో ప్రత్యామ్నాయంగా పలు బాధ్యతలు అప్పగించారు.

• జిల్లాలోని ఆరు డివిజన్‌లో ఇప్పటికే ఆత్మ కమిటీలు సైతం ఏర్పాటయ్యాయి. జిల్లా స్థాయిలో వచ్చే నెలలో కిసాన్ మేళా నిర్వహణకు సైతం ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు.

జిల్లాలో వివరాలు ఇలా

సాగు విస్తీర్ణం 2.63 లక్షలు. రైతులు 3.12 లక్షలు

చిన్నారి చూపునకు మసక !

• ఆర్‌బీఎస్‌కే పరీక్షల్లో వెల్లడి

మిర్యాలగూడ, నాగార్జున సాగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యార్థులకు కంటి చూపు మసక బారుతోంది. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కింద విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల్లో ఈ విషయం తేలింది. విద్యార్థులు కంటి చూపు తర్వాత... దంత, చర్మ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు గుర్తించి నివారించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ కార్యక్రమం కింద వైద్యులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రత్యేక వైద్య బృందాలు ఏటా ఒకసారి ప్రతీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నాయి. పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషక ఆహార లేమి ఎదుగుదలకు సంబంధించిన ఇబ్బందులు తదితరాలను వైద్యులు గుర్తిస్తున్నారు. అవసరమైన వారికి చికిత్స చేస్తున్నారు. విద్యార్థి దశలో మెరుగైన ఆరోగ్యానికి తీసుకోవాల్సిన సలహాలు సూచనలు అందిస్తున్నారు. అయితే పిల్లల్లో దృష్టి లోప సమస్యలు వెలుగులోకి వస్తుండటం ఆందోళనకు గురి చేస్తోంది.

అప్రమత్తతతోనే మేలు.. ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఎక్కువ సమయంలో చూస్తుండటంతోనే పిల్లల్లో కంటి చూపు సమస్యలు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. స్క్రీన్ వెలుతురు సోకడంతో కంటి చూపు మందగిస్తుంది. ప్రధానంగా పిల్లలు రాత్రిపూట చీకట్లో స్మార్ట్ ఫోన్లు, ట్యాబులను ఎక్కువగా చూస్తున్నారు. చిన్నారులు వాటికి ఎక్కువ సమయం కేటాయించకుండా పుస్తకాలను చదివించే అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని నిపుణులు చెబుతున్నారు. బాల్య దశలోనే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను నియంత్రించకపోతే భవిష్యత్తులో పిల్లలకు కంటి సంబంధిత సమస్యలు తీవ్రం అవుతాయని హెచ్చరిస్తున్నారు.

సినిమాలు మిర్యాలగూడ పట్టణం,న్యూస్‌టుడే:

రాఘవ: ఇరుముడి, శ్రీనివాస: టాక్సిక్, వెంకటేశ్వర: ఇరుముడి, విట్రోస్: టాక్సిక్, హుషార్ పిట్టలు, విశ్వనాథ్ అండ్ సన్స్, ఇరుముడి

బోనమెత్తి.. అమ్మవారికి నైవేద్యం సమర్పించి


మిర్యాలగూడలోని చింతపల్లి ఇందిరమ్మ కాలనీలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ పట్టణం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కలాల్‌వాడ ముత్యాలమ్మ ఆలయానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు చిలుకూరి బాలు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, గుడిపాటి నవీన్, కౌన్సిలర్లు ఆడోత్ అశోక్, నూకల కవిత పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని తీదేడు గ్రామంలో ముత్యాలమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, భారాస రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్ పాల్గొని పూజలు చేశారు. కంకణాల వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దేన్యతండా సర్పంచి కొండల్, ప్రసాద్ పాల్గొన్నారు. మల్లారెడ్డిపల్లిలో ఆదివారం కనుల పండువగా ముత్యాలమ్మ బోనాలు, పెద్దమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు జబ్బు లింగం, బైకని రాములు, జక్కుల శ్రీశైలం, కనుకటి శ్రీశైలం పాల్గొన్నారు.

హాలియా: హాలియా పురపాలికలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఊర బోనాలు ఘనంగా నిర్వహించారు. సాయిప్రతాప్ నగర్ కాలనీలో ఈదమ్మ గుడి ప్రతిష్ఠ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పుర ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ చింతల చంద్రారెడ్డి, గౌని రాజా రమేష్‌గౌడ్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.


ఈదులగూడెంలో శ్రావణ మాస బోనాలు సమర్పిస్తున్న భక్తులు


హాలియాలో బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

డిండి: సింగరాజుపల్లిలో ఆదివారం పెద్దమ్మ దేవత బోనాల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిర్యాలగూడ గ్రామీణం: మండలంలోని అవంతీపురంలో గ్రామ దేవత ముత్యాలమ్మకు బోనాలు ఆదివారం నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచి సుజాత, ఉప సర్పంచి మహేష్, వీరయ్య, రవి, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ: పట్టణంలో శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా ఈదులగూడెంలో ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు.